ప్రజాశక్తి
శనివారం 12 నవంబర్ 2022
పార్వతీపురం మన్యం



23న ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల

ప్రజాశక్తి- కలెక్టరేట్

శాసన మండలి పట్టభద్రుల ఓటరు ముసాయిదా జాబితా ఈనెల 23న విడుదల చేయనున్నట్టు డిఆర్ఒ జె.వెంకటరావు అన్నారు. శాసన మండలి పట్టభద్రుల ఎన్నికలు, ఓటరు నమోదు కార్యక్రమంపై జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీలతో సమావేశం జరిగింది. ఈనెల 23న ముసాయిదా ఓటరు జాబితా విడుదల చేస్తారని, క్లైమ్ లు, అభ్యంతరాలను డిసెంబరు 9 వరకు స్వీకరిస్తారని ఆయన చెప్పారు. ఇదే సమయంలో కొత్తగా ఓటరుగా నమోదు చేసుకునే అవకాశం ఉందన్నారు. క్లైమ్ లు, అభ్యంతరాల పరిష్కారం డిసెంబరు 25నాటికి పూర్తవుతుందని, తుది ఓటరు జాబితా డిసెంబరు 30న విడుదల అవుతుందని ఆయన అన్నారు. ఓటరు నమోదు కార్యక్రమంలో దాదాపు 17 వేల మంది పట్టభద్ర ఓటర్లు నమోదు అయ్యారని తెలిపారు. సమావేశంలో పలువురు రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

నెరవేరని కేంద్రం హామీలు

- మోడీ వైఖరితో మరింత గడ్డు పరిస్థితి
- అభివృద్ధికి దూరమైన విజయనగరం, పార్వతీపురం జిల్లాలు
- నేడు ప్రధాని సభ ● జనాల తరలింపునకు వైసిపి తహతహ



గిరిజన వర్సిటీ భూసేకరణ మ్యాపును పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

రాష్ట్ర విభజన సందర్భంగా జిల్లాకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేరలేదు. పైగా ప్రధాని మోడీ అవలంభిస్తున్న విధానాల వల్ల జిల్లాలోని అపారమైన ఖనిజ సంపద, సహజ వనరుల వినియోగం లేదు. కొద్దిపాటి ఉద్యోగాలు, ఉపాధి మార్గాలు కోల్పోవాల్సివచ్చింది. అయినా, పొరుగు జిల్లా విశాఖపట్నం పర్యటనకు వస్తున్న ప్రధాని మోడీకి బ్రహ్మరథం పట్టేందుకు వైసిపి సిద్ధమైంది. అన్ని నియోజకవర్గాల నుంచి భారీగా జనాల తరలించేందుకు భారీ సంఖ్యలో వాహనాలు ఏర్పాటు చేసింది. రాష్ట్ర విభజన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు విజయనగరం ఉమ్మడి జిల్లాలో పారిశ్రామిక నగరాన్ని నిర్మిస్తామని, ఫుడ్‌పార్కులు, ఎలక్ట్రానిక్ అండ్ హార్డ్‌వేర్ పార్కు ఏర్పాటు చేస్తామని, గిరిజన యూనివర్శిటీని నిర్మిస్తామని, విజయనగరాన్ని స్మార్ట్ సిటీగా తయారు చేయారు చేస్తామని అప్పటి రాష్ట్ర ప్రభుత్వం హామీలు గుప్పించింది. అటు పూసపాటిరేగ తీరంలో పోర్టు, భోగాపురంలో గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్టు నిర్మిస్తామని కూడా చెప్పింది. విజయనగరంలో సంగీత, లలిత కళల అకాడమీ ఏర్పాటుకు హామీ ఇచ్చింది. దీంతోపాటు వెనుకబడిన జిల్లాకు ప్రత్యేక నిధులు కేటాయిస్తామని నమ్మబలికింది. కేంద్రం సాయంతో జిల్లాలో తలపెట్టిన మెడికల్ కాలేజీ నిర్మిస్తామని, ఏడాదిలో తోటపల్లి సాగునీటి ప్రాజెక్టును పూర్తి చేస్తామని చెప్పారు. వీటిలో మెడికల్ కాలేజీ నిర్మాణం ఎట్టకేలకు ప్రారంభం కావడం తప్ప మరేవీ అమలుకు నోచుకోలేదు. ఆ మెడికల్ కాలేజీ నిర్మాణానికి కూడా కేంద్ర ప్రభుత్వ సాయం లేదు. ముఖ్యంగా విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలు పూర్తిగా వ్యవసాయ ఆధారితంగా మనుగడ సాగిస్తున్నాయి. వర్షాలకు కొదవలేదు. కానీ సాగునీటి వనరులను అభివృద్ధి చేయకపోవడం వల్ల నీరంతా వృథాగా పోతోంది. మన జిల్లాకు వ్యవసాయ రంగం ద్వారా కేవలం 41.2శాతం మాత్రమే వస్తోంది. ఈ వెనుకబాటును అధిగమించేందుకు కేంద్రం సాయం చేయకపోవడంతో తోటపల్లి సాగునీటి ప్రాజెక్టు పనులు పడకేసింది. అటు ఫుడ్ పార్కుల హామీ నెరవేరలేదు. పారిశ్రామిక, సేవా రంగాల్లోనూ వెనుకబాటు ఉంది. జిల్లాలో పారిశ్రామిక నగరాన్ని ఏర్పాటు చేస్తామని, ఎలక్ట్రానిక్ అండ్ హార్డ్‌వేర్ పార్కు హామీ ఇచ్చినప్పటికీ ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేదు. పైగా కేంద్ర ప్రభుత్వ వైఖరి వల్ల జిల్లాలో జ్యూట్, చక్కెర మిల్లులన్నీ మూతపడ్డాయి. ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమలు చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నాయి. దీంతో, బిజెపి అధికారంలోకి వచ్చిన తరువాత ఉమ్మడి విజయనగరం జిల్లాల్లో సుమారు 30వేల మంది కార్మికులు ఉపాధి కోల్పోయారు. మరోవైపు విజయనగరంలోని విటి అగ్రహారం, బొబ్బిలి గ్రోత్ సెంటర్, సారిపల్లి, కంటకాపల్లి పారిశ్రామిక వాడల్లో అనేక పరిశ్రమలు కనుమరుగయ్యాయి. ఇలా విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలు పారిశ్రామిక రంగంలో రాష్ట్రంలోనే వెనుకబడ్డాయనడంలో సందేహం లేదు. గిరిజన వర్శిటీ అడ్మిషన్లు ప్రారంభించి మూడేళ్లు గడుస్తున్నా ఇప్పటికీ శాశ్వత ప్రతిపాదికన భవన సముదాయం నిర్మాణానికి చర్యలు తీసుకోలేదు. స్థల గుర్తింపు, సేకరణ పేరుతో కేంద్ర ప్రభుత్వం కాలక్షేపం చేస్తోంది. గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్టు పేరిట 2203 ఎకరాలకు గాను 2183 ఎకరాలకు క్లియరెన్స్ పూర్తయినప్పటికీ నిర్మాణానికి కేంద్ర సాయం కరువవ్వడంతో రాష్ట్ర ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోంది. ఇలా చెప్పుకుంటూ పోతే జిల్లాకు కేంద్ర ప్రభుత్వం చేసిన మోసాలు అన్నీ ఇన్నీ కావు. చివరకు భోగాపురం ఎయిర్‌పోర్టు పనుల శంకుస్థాపన చేస్తారంటూ మంత్రి బొత్స ప్రకటించినా ప్రధాని ముందుకు రాలేదు. ఇటువంటి పరిస్థితుల్లో ప్రధాని పర్యటనకు ముందే ఈ సమస్యలపై ప్రశ్నించాల్సిన వైసిపి తనకు పట్టనట్టు వ్యహరిస్తోందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

మోడీ గో బ్యాక్

- విశాఖ స్టీల్ ప్లాంట్‌ను అమ్మబోమని మోడీ ప్రకటించాలి
- ప్రజా సంఘాల డిమాండ్



అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న వామపక్ష, ప్రజాసంఘాల నాయకులు

ప్రజాశక్తి - కలెక్టరేట్

విశాఖ స్టీల్ ప్లాంట్ అమ్మడం లేదని రేపు విశాఖ పర్యటించనున్న నరేంద్ర మోడీ ప్రకటించాలని వామపక్ష సంఘాలు డిమాండ్ చేస్తూ శుక్రవారం స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వామపక్ష ప్రజాసంఘాల నాయకులు మాట్లాడుతూ నరేంద్ర మోడీ ఆంధ్ర రాష్ట్రానికి తీవ్రమైన ద్రోహం చేశారని, విశాఖ స్టీల్ ప్లాంట్‌ను పోస్కో కంపెనీకి కారుచౌకగా కట్టపెట్టాలని ప్రయత్నిస్తున్నారని అన్నారు. లక్ష మంది కార్మికులు, ప్రజల బతుకుని ఉత్తరాంధ్ర ప్రజల మనోభావాలను పరిగణనలోకి తీసుకోకుండా కార్పొరేట్లకు స్టీల్ ప్లాంట్‌ను ధారదత్తం చేస్తున్నారని విమర్శించారు. పైగా విశాఖలో ఈనెల 12న ప్రధాని నరేంద్ర మోడీ పర్యటన చేయడమంటే ఆంధ్ర రాష్ట్ర ప్రజలను అవమానపర్చినట్టేనన్నారు. మోడీ పర్యటన సందర్భంగా విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను అమ్మడం లేదని ప్రకటన చేయాలన్నారు. వంద శాతం సామర్థ్యంతో నడపాలని ప్రత్యేక హోదా ఇస్తామని, విభజన హామీలు నెరవేరుస్తామని ప్రకటన చేయాలని అన్నారు. రాష్ట్రానికి ద్రోహం చేస్తున్న మోడీనిజగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఏమీ అనకుండా కేంద్రం విధానాల్ని అమలు చేస్తూ ప్రజా ఉద్యమాలపై దాడి చేస్తుందని, ఇది మంచి పద్ధతి కాదని అన్నారు. స్టీల్ ప్లాంట్ పరిరక్షణ కమిటీ నాయకులు వై.మన్మధరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు, సిపిఐఎంఎల్ నాయకులు నర్సింగరావు, రైతు కూలీ సంఘం నాయకులు బాషా, అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకులు రాజు, అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పి.సంఘం, ఇఫ్టూ నాయకులు సర్వేశ్వరరావు, సిఐటియు జిల్లా అధ్యక్షులు జి.వెంకటరమణ, బివి రమణ, ఎస్‌ఎఫ్ఐ జిల్లాకార్యదర్శి రాజశేఖర్, ఎఐఎస్‌ఎఫ్ నాయకులు బిటి నాయుడు పాల్గొన్నారు

అలాగే విజయనగరం జిల్లాలోని విజయనగరం, బొబ్బిలి, నెల్లిమర్ల, శృంగవరపుకోట, రామభద్రపురం తదితర మండలాల్లో మోడీ గోబ్యాక్ అంటూ నిరసనలు తెలిపారు. విజయనగరంలోని కలెక్టరేట్ వద్ద కార్మిక, ప్రజాసంఘాలు, సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్ పార్టీల ఆధ్వర్యాన నిరసనలు తెలిపారు. స్టీల్ ప్లాంట్ పై మోడీ ప్రకటన చేయాలని, విభజన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ వద్ద రాస్తారోకో చేశారు. కాంగ్రెస్ ఆధ్వర్యాన విజయనగరం ఆర్‌టిసి కాంప్లెక్సు వద్ద మోడీ గో బ్యాక్ అంటూ నిరసన తెలిపారు.



మౌలానా అబుల్‌కలాం ఆజాద్‌కు నివాళ్లు అర్పిస్తున్న కలెక్టర్, అధికారులు

అబుల్ కలాం ఆజాద్‌కు నివాళి

ప్రజాశక్తి - కలెక్టరేట్

భారతరత్న మౌలానా అబుల్ కలాం జయంతి శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఘనంగా జరిగింది. కలెక్టర్ నిశాంత్ కుమార్ కలాం చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ దేశ మొదటి విద్యా శాఖ మంత్రిగా పనిచేసి, గొప్ప విద్యా విధానానికి పునాది వేశారని కొనియాడారు. దేశ భవిష్యత్తు దృష్ట్యా దీర్ఘకాలిక వ్యూహంతో విద్యా విధానాలు ప్రవేశపెట్టాం న్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో కీలక పాత్ర పోషించారని, ఉద్యమాన్ని బలోపేతం చేయడానికి కృషి చేశారని పేర్కొన్నారు. ప్రజలలో స్వాతంత్ర్య ఉద్యమ స్ఫూర్తి నింపి, స్పందన రప్పించారని పత్రిక స్థాపించి ఉద్యమంలో తన వంతు పాత్ర పోషించారని తెలిపారు. దేశ విభజన, ఇతర సందర్భాల్లో మతపరమైన దాడులు జరుగుతున్నప్పుడు మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఉదారంగా పనిచేస్తూ, ఉద్రిక్తతలు తగ్గించేందుకు ఎంతగానో కషి చేశారని వివరించారు. ఆజాద్ జయంతి రోజున అల్ప సంఖ్యాక వర్గాల దినోత్సవంగా ప్రకటించడం శుభసూచకమని చెప్పారు. ఈ సందర్భంగా అల్ప సంఖ్యాక వర్గాల ప్రతినిధులు షేక్ షఫీ, మహ్మద్ జలాల్, సందీర్ చంద్ర తదితరులు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో డిఆర్ఒ జె.వెంకటరావు, ఆర్‌డిఒ కె.హేమలత, పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పాలకొండ : పట్టణంలో వెంకంపేట ఎంపియుపి పాఠశాలలో శుక్రవారం భారతదేశ తొలి విద్యాశాఖామంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. హెచ్ఎం జె.పరంకుశంనాయుడు మాట్లాడుతూ భారత స్వాతంత్ర సమరంలో ముఖ్యనాయకుల్లో ఒకరన్నారు. ఆయన కవి అని అరబిక్, ఇంగ్లీష్, వుర్దూ, బెంగాలి తదితర భాషాల్లో ప్రావీణ్యులని కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాతృ మరణాలు సంభవించకూడదు

- నెగిటివ్ రక్త గ్రూపు దాతలు ముందుకు రావాలి
- హై రిస్క్ కేసులకు ఆర్ఎంపిల చికిత్స వద్దు
- వైద్యాధికారుల సమావేశంలో కలెక్టర్



జిల్లా వైద్యాధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

ప్రజాశక్తి కలెక్టరేట్

మాతృ మరణాలు సంభవించకూడదని, ఒకవేళ జరిగితే పక్కా విశ్లేషణ ఉండాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ అన్నారు. వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, వైద్యులతో మాతృ మరణాల పట్ల కలెక్టర్ శుక్రవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో మాతా, శిశు మరణాలు సంభవించకుండా ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. మాతృమరణాలు జరగడానికి సౌకర్యాల లోపమా, వైద్య సేవల్లో లోపమా, సామాజిక పరమైన అంశాలు ఉన్నాయా అనే కారణాలను విశ్లేషించాలని స్పష్టం చేశారు. ఉప కమిటీ పక్కాగా విచారణ చేయాలని ఆయన ఆదేశించారు. గర్భిణీలు ప్రసవ సమయంలో మృతి చెందితే అందుకు గల నిర్దిష్టమైన కారణం కనుగొనాలని స్పష్టం చేశారు. వైద్య సౌకర్యాలు అందుబాటు, క్లినికల్ సౌకర్యాల లభ్యత, సామాజిక విధానంలో జరిగిన తప్పులు విశ్లేషించాలని సూచించారు. గర్భిణీల ఆరోగ్యం పట్ల పిహెచ్‌సి వైద్యులు, క్షేత్ర స్థాయి వైద్య సిబ్బంది గ్రామాల్లో పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలని ఆదేశించారు. హై రిస్క్ కేసులకు ఆర్ఎంపి వైద్యులు చికిత్స అందించడం పట్ల తీవ్రంగా పరిగణించాలని కలెక్టర్ ఆదేశించారు. కొన్ని మండలాల్లో హై రిస్క్ కేసులకు ఆర్ఎంపిలు ఐవి ఫ్లూయిడ్స్ ఇవ్వడంతో గర్భిణీల ఆరోగ్య పరిస్థితుల్లో విపరీతమైన మార్పులు వచ్చి మరణాలు సంభవిస్తున్నట్లు ఎఎన్ఎం, ఆశా కార్యకర్తలు వివరించడం పట్ల కలెక్టర్ తీవ్రంగా పరిగణించారు. ప్రసవాలకు వచ్చే వారి రక్తపు గ్రూప్ ముందుగా పిహెచ్‌సి స్థాయిలో గుర్తించి జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారికి తెలియజేయాలని అన్నారు. అవసరం మేరకు రక్తపు యూనిట్లు సిద్ధం చేయాలని ముఖ్యంగా నెగిటివ్ బ్లడ్ గ్రూప్ పై ప్రత్యేక దష్టి సారించాలని ఆయన సూచించారు. ఇప్పటి వరకూ చికిత్స అందించిన నెగిటివ్ బ్లడ్ గ్రూప్ వ్యక్తుల వివరాలు సమర్పించాలని ఆయన ఆదేశించారు.

రక్త దానానికి ముందుకు రావాలి

ప్రసవ సమయంలో అవసరమగు రక్తపు యూనిట్లు, ముఖ్యంగా నెగిటివ్ బ్లడ్ గ్రూపులు అందుబాటులో ఉండక పోవడంపై కలెక్టర్ స్పందిస్తూ యువత రక్త దానానికి ముందుకు రావాలని కోరారు. రక్త దానం ప్రాణ దానమని గుర్తించాలని ఆయన పేర్కొన్నారు. రక్త దాతలు తమ పేర్లను జిల్లా ఆసుపత్రిలో నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. జిల్లా ఆసుపత్రిలో ఇందుకు ప్రత్యేక కౌంటర్‌ను శని వారం ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ముఖ్యంగా నెగిటివ్ బ్లడ్ గ్రూప్ ఉన్న వ్యక్తులు ముందుకు వచ్చి సహకరించాలని, ప్రాణాలు కాపాడాలని కోరారు.

ప్రాంతాలను గుర్తించండి - అవగాహన కల్పించండి

మూడు కంటే ఎక్కువ మంది పిల్లలు ఉన్నకుటుంబాలను గుర్తించాలని కలెక్టర్ ఆదేశించారు. గుమ్మలక్ష్మీ పురం మండలంలో ఒక గ్రామంలో 30 ఏళ్ల వయస్సులో 8వ కాన్పులో మృతి చెందినట్లు గుర్తించారు. దీనిపై స్పందిస్తూ ఇటువంటి అభ్యర్థులను మండలాల వారీగా గుర్తించాలని సూచించారు. ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారని, దీన్ని నివారించాలని ఆయన ఆదేశించారు. ఇటువంటి ప్రాంతాలను గుర్తించి, కుటుంబ నియంత్రణ చికిత్సలు చేపట్టాలని ఆయన పేర్కొన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. బగాది జగన్నాథ రావు మాట్లాడుతూ జిల్లాలో 11 మాతృ మరణాలు సంభవించాయని తెలిపారు. సమావేశంలో డిహెచ్‌సిఒ బి.వాగ్దేవి, వైద్య శాఖ అధికారులు ధవళ భాస్కరరావు, అనిల్, టి.జగన్మోహన రావు, సి.హెచ్.విజయ కుమార్, ఐసిడిఎస్ పీడీ జి.వరహాలు, తదితరులు పాల్గొన్నారు.



గర్భిణుల హాస్టల్‌ను పరిశీలిస్తున్న ఐటిడిఎ పిఒ విష్ణుచరణ్

వైటిసి సమస్యలపై పిఒకు ఏకరువు

గర్భిణుల వసతి గృహం తనిఖీ

ప్రజాశక్తి - సాలూరు

పార్వతీపురం ఐటిడిఎ పిఒ విష్ణు చరణ్ శుక్రవారం గుమడాంలో గల వైటిసిని, అక్కడే ఉన్న గర్భిణుల వసతిగృహాన్ని తనిఖీ చేశారు. గర్భిణులతో ఆయన మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వసతి గృహం నిర్వాహకులు నీడ్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ పి.వేణుగోపాలరావు సమస్యలను వివరించారు. వసతి గృహంలో మరో 20బెడ్లు మంజూరు చేయాలని, విద్యుత్ మరమ్మతు పనులు చేయాలని కోరగా ప్రతిపాదనలు పంపించాలని పిఒ సచించారు ప్రస్తుతానికి 37మంది గర్భిణులు వసతిగృహంలో ఉన్నారన్నారు. మెనూ ప్రకారం ఆహారం పంపిణీ చేస్తున్నారా అని గర్భిణులను ఆరా తీశారు. వసతిగృహం నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం వైటిసి మేనేజర్లు ప్రశాంత్ కుమార్, విద్యాసాగర్ సమస్యలు వివరించారు. గడచిన రెండేళ్ళుగా గిరిజన నిరుద్యోగులకు శిక్షణ కార్యక్రమాలు లేవని చెప్పారు. 22నెలలుగా పనిచేస్తున్న తమకు జీతాలు అందడం లేదని సిబ్బంది చెప్పారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పిఒ విష్ణు చరణ్ హామీ ఇచ్చారు.

ఎంఎల్ఎస్ పాయింట్ తనిఖీ

పట్టణంలోని మండల తహశీల్దార్ కార్యాలయం వద్ద ఉన్న సివిల్ సప్లయ్ గోడౌన్‌ను పిఒ విష్ణు చరణ్ తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఆన్ లైన్‌లో సరుకులకు, స్టాక్ రిజిస్టర్‌లో సరుకులకు తేడా లేకపోవడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. గోడౌన్ చాలా పురాతనమైనదని, వర్షాలకు కారుతున్నదని జిసిసి మేనేజర్ జె.రామారావు పిఒదృష్టికి తీసుకెళ్లారు. గోడౌన్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. అనంతరం పాచిపెంట మండలం కోష్టువలసలోని జిసిసి డిపోని తనిఖీ చేశారు. అక్కడి సరుకులు, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు.

ప్రభుత్వ కళాశాలల్లో సమస్యలు పరిష్కరించాలి

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద విద్యార్థుల ధర్నా ● పరిష్కారానికి విద్యా శాఖ మంత్రి హామీ



ధర్నానుద్దేశంచి మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు వెంకటేష్

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

జిల్లాలో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలో నెలకొన్న విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు శుక్రవారం కలెక్టరేట్ వద్ద పెద్దఎత్తున ధర్నా చేశారు. సమస్యలు పరిష్కరించాలంటూ నినదించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సిహెచ్ వెంకటేష్, పి రామ్మోహన్ మాట్లాడుతూ జిల్లాలో విద్యారంగం అస్తవ్యస్తంగా ఉందని, ప్రైవేట్ విద్యాసంస్థలు ఐఐటి, నీట్ అంటూ పరుగులు పెడుతుంటే ప్రభుత్వ కళాశాలల్లో మంచినీరు, మరుగుదొడ్ల సౌకర్యం కూడా కల్పించలేక నడవలేని స్థితిలో ఉన్నాయని అన్నారు. ప్రతి జూనియర్ కళాశాలలోనూ ఫ్యాకల్టీ సమస్య ఉందని, జూనియర్, డిగ్రీ కళాశాలల్లో ఖాళీగా ఉన్న లెక్చరర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, విద్యార్థులకు అవసరమైన పాఠ్యపుస్తకాలు వెంటనే అందజేయాలని, మరుగుదొడ్ల సౌకర్యం సౌకర్యం కల్పించాలని కోరారు. జామి, భోగాపురం మండలాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు నిర్మించాలని, అన్ని జూనియర్ కళాశాలకు ప్రహరీ గోడలు తక్షణమే నిర్మించాలని, విజయనగరం, గజపతినగరం డిగ్రీ కళాశాలలకు సొంత భవనాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్ లో ఉన్న అమ్మఒడి నిధులు వెంటనే విడుదల చేయాలని కోరారు. ఈ సందర్భంగా విద్యార్థులు కలెక్టర్ సూర్య కుమారిని, రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణను కలిసి వినతినిచ్చారు. స్పందించిన మంత్రి అక్కడి నుంచే విద్యాశాఖ కార్యదర్శితో ఫోన్‌లో మాట్లాడారు. రోజుల వ్యవధిలోనే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. దీంతో ఎస్ఎఫ్ఐ నాయకులు ఆందోళన విరమించారు. డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు హరీష్, రుద్రప్రసాద్ విద్యార్థుల పోరాటానికి మద్దతు పలికారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు డి.రాము , వి చిన్నబాబు, సతీష్ దేవ్ సింగ్, సిహెచ్ పావని, తాటినాయుడు, హర్ష రామకృష్ణ , జిల్లా సహాయ కార్యదర్శులు సౌమ్య , రవి కుమార్, తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకుంటే అనుమతులు రద్దు : మంత్రి

విజయనగరం : ప్రభుత్వ నిబంధనలు పాటించని కళాశాలల అనుమతులను రద్దు చేయాలని విద్యాశాఖా మంత్రి బొత్స సత్యనారాయణ ఆర్ఐఒ, జిల్లా ఒకేషనల్ అధికారికి ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ ఛాంబర్ లో మంత్రి జిల్లా కలెక్టర్ సూర్య కుమారి, జెసి మయూర్ అశోక్, అర్‌డిఒ సూర్యకళతో సమావేశం నిర్వహించారు. ప్రతి కాలేజీని డివిఇఒ, ఆర్ఐఒ, ఇఇలు కలసి జాయింట్ తనిఖీ చేసి ప్రతిపాదనలు కలెక్టర్ ద్వారా పంపాలని మంత్రి ఆదేశించారు.జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆధునీకరణకు, అభివృద్ధికి ప్రతిపాదనలు తయారు చేసి పంపాలని తెలిపారు. స్థానిక మున్సిపల్ హైస్కూల్ లో ఉర్దూ టీచర్ పోస్ట్ ఖాళీగా ఉందని, ఉర్దూ ఉపాధ్యాయుడ్ని నియమించాలని కలెక్టర్ మంత్రిని కోరారు.

ప్రజలకు అందుబాటులో వైద్యం

వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రజా ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సంచాలకులు డాక్టర్ వి.రామిరెడ్డి

ప్రజాశక్తి - కలెక్టరేట్

ప్రజలకు ఎల్ల వేళలా వైద్యం అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని ప్రజా ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సంచాలకులు డాక్టర్ వి.రామిరెడ్డి అన్నారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 873 వైద్యాధికారుల పోస్టులు శాశ్వత ప్రాతిపదికన భర్తీ చేస్తున్నట్టు తెలిపారు. అన్ని జిల్లాల్లో ఖాళీగా ఉన్న పోస్టులు దఫదఫాలుగా కౌన్సిలింగ్ చేసి ఆసక్తి గల ఎంబిబిఎస్ అర్హత ఉన్న అభ్యర్థులను గిరిజన, మైదాన ప్రాంతాల్లో నియమి స్తున్నట్టు తెలిపారు. ఖాళీలను ఈనెల 9,10 తేదీల్లో కౌన్సిలింగ్ చేసి నియమించామని ఆయన చెప్పారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో పనిచేస్తున్న కొంత మంది వైద్యులు ఉన్నత చదువులకు ఎంపిక కావడం, వారి స్థానంలో వైద్యులను నియమించినట్లు తెలిపారు. కొత్తగా నియమించిన వైద్యులు చేరిన తర్వాత మాత్రమే ఉన్నత విద్య కోసం వెళ్లే వైద్యులను రిలీవ్ చేయమని జిల్లా వైద్యాధికా రులకు రాతపూర్వకంగా ఆదేశించామని చెప్పారు. కొత్తగా నియామకమైన వైద్యులు గరిష్టంగా వారం రోజుల్లోగా ఆయా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో తప్పక చేరాలని ఆదేశించామని చెప్పారు. ప్రభుత్వం చేపట్టిన ప్రతిష్టాత్మక ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ కోసం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఇద్దరు చొప్పున వైద్యులను నియమించామన్నారు. వైద్యులను నియమించిన ప్రదేశాల్లో నివాసం వుండాలని ఆదేశించినట్టు చెప్పారు.



మాట్లాడుతున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ పిడిఎఫ్ అభ్యర్థి రమాప్రభ

ఉత్తరాంధ్ర సమస్యల పరిష్కారంలో

ప్రభుత్వం విఫలం

పట్టభద్రుల ఎమ్మెల్సీ పిడిఎఫ్ అభ్యర్థి రమాప్రభ

ప్రజాశక్తి - లక్కవరపుకోట

ఉత్తరాంధ్ర సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందని ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ అన్నారు. త్వరలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికకు పిడిఎఫ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆమె మండల కేంద్రంలోని పలు పాఠశాలల్లో శుక్రవారం సాయంత్రం పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ వద్దని చెప్పడానికి ఇక్కడి పట్టభద్రుల ప్రతినిధులకు నోరు మెదపకపోవడం విచారకరమన్నారు. ఈ ప్రాంతపు విద్యావంతుల సమస్యలను, మనోభావాలను శాసనమండలిలో శక్తివంతంగా వినిపించడానికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఉద్యోగ , ఉపాధ్యాయ , కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయలేదు సరి కదా... వాటి అమలు కోరుతున్న వారిపై తీవ్ర నిర్బంధాలకు పాల్పడుతోందన్నారు. పి ఆర్‌సిని తగ్గించడంతో పాటు సిపిఎస్ రద్దు అంశంలో పూర్తిగా మాట తప్పిందని అన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జెఎవిఆర్ కె ఈశ్వరరావు , జిల్లా సహాధ్యక్షులు జి పార్వతి , లక్కవరపుకోట యుటిఎఫ్ మండల శాఖ అధ్యక్ష , ప్రధాన కార్యదర్శులు ఐ.శ్రీనివాసరావు, ఎస్ సన్యాసినాయుడు , నాయకులు గాడి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి క్రీడలకు మోడల్ స్కూల్ విద్యార్థులు

భామిని : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి ఆటల పోటీలకు స్థానిక మోడల్ స్కూల్, కాలేజీ విద్యార్థులు తమ ప్రతిభను చాటి రాష్ట్రస్థాయి పోటీలకు 10 మంది ఎంపికైనట్లు ప్రిన్సిపల్ ఆర్.శివకుమార్ తెలిపారు. కబడ్డీ అండర్ 17 విభాగంలో బి.లక్ష్మి, బి. ఆదమ్మ, అండర్ 14 విభాగంలో బి.భావన, బాక్సింగ్ అండర్ 17 విభాగంలో కె.మహాలక్ష్మి, కె.జస్వంత్, అండర్ 14 విభాగంలో ఎ.జస్వంత్, సాయి నిశాంత్, క్రికెట్ అండర్ 14 విభాగంలో పి.దీక్షిత, ఎ.శృతి, అండర్-17 విభాగంలో బి.ప్రశాంత్ ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులను ఫిజికల్ డైరెక్టర్ జి.శివరాంప్రసాద్, ప్రిన్సిపల్, పాఠశాల సిబ్బంది అభినందించారు.

ఉపాధి పనుల గుర్తింపునకు గ్రామసభ

వీరఘట్టం : మండలంలోని తప్పలభద్రలో 2023- 24 గాను ఉపాధి హామీ పనులు చేపట్టేందుకు శుక్రవారం గ్రామ సభ నిర్వహించారు. గ్రామల్లో ఏప పనులు చేపట్టాలో వాటిని గురించి గ్రామ సభలో ఉపాధి హామీ సిబ్బంది కూలీలకు వివరించారు. ఆయా పనులపై పంచాయతీలో రూ.80 లక్షల పనులకు ప్రతిపాదనలు చేసినట్లు సర్పంచ్ వానరాజు వివరించారు. సమావేశంలో ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్ అప్పలనాయుడు, ఫీల్డ్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

కరోనా ప్రభావంపై ఎస్‌సిఇఆర్‌టి సర్వే

జియ్యమ్మవలస : కరోనా సమయంలో విద్యార్థుల మానసిక, అభ్యసనాలపై ప్రభావం ఏ విధంగా ఉందనే దానిపై ఎస్‌సిఇఆర్‌టి వారు సర్వే నిర్వహించారు. ఇందులో భాగంగా మండలంలోని పెదమేరంగి తిరుమల సాయి విద్యానికేతన్‌లో శుక్రవారం సర్వే బృందం పరిశీలించింది. భవిష్యత్తులో మళ్లీ ఇలాంటి పరిస్థితులు ఏర్పడితే ఎలా అధిగమించాలి, అలాగే విద్యార్థులను పాఠశాలకు రప్పించి విద్య కొనసాగించడంపై ఎదుర్కొనే సమస్యలు తదితర అంశాలపై తల్లిదండ్రులతో బృందం చర్చించింది. ఈ సర్వేకు తమ పాఠశాలను ఎంపిక చేసినట్లు కరస్పాండెంట్ రౌతు సరళ కుమారి తెలిపారు. సర్వే బృందంలో డైట్ ప్రిన్సిపల్ ఎస్.టి.నాయుడు, డి.అప్పలనాయుడు, వి.పార్థసారథి, విజయభాస్కరరావు, కె.గోవిందు ఉన్నారు.

హెచ్‌ఎంను సస్పెండ్ చేయాలి : ఎస్‌ఎఫ్‌ఐ

గుమ్మలక్ష్మీపురం : సాలూరు మండలం కురుకుట్టి గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థినిలపై లైంగిక వేధింపులు పాల్పడిన హెచ్‌ఎం కృష్ణారావును సస్పెండ్ చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ మండల కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు మండల అధ్యక్షులు గంగారావు మాట్లాడుతూ విద్యార్థినిలను కాపాడాల్సిన ఉపాధ్యాయులు ఇలా విద్యార్థినిలపై ప్రవర్తించడం సిగ్గుచేటు అన్నారు. హెచ్‌ఎం కృష్ణారావును తక్షణమే సస్పెండ్ చేసి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు అనిల్,కార్యదర్శి మహేష్ పాల్గొన్నారు.

బాపూజీ నాయుడు కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

పార్వతీపురం టౌన్ : జెడ్పీ వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడును స్థానిక ఎమ్మెల్యే ఎ.జోగారావు శుక్రవారం పరామర్శించారు. బాపూజీనాయుడు తల్లి రవణమ్మ అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే రాయవలసలో ఆయన ఇంటి వెళ్లి పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఎమ్మెల్యేతో పాటు వైసిపి పట్టణ అధ్యక్షులు కొండపల్లి బాలకృష్ణ కౌన్సిల్ సభ్యులు రబిలో చిన్నం నాయుడు, మంత్రి రవికుమార్, గురునాయ తదితరులు పాల్గొన్నారు.

కేశవరావును పరామర్శించిన శత్రుచర్ల

గుమ్మలక్ష్మీపురం : మండల టిడిపి సీనియర్ నాయకులు తాడంగి కేశవరావు అనారోగ్యంతో బాధపడుతున్నారని తెలుసుకున్న మాజీమంత్రి విజయరామరాజు పి.ఆమటి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యం కుదుటపడాలని కోరుకుంటున్నా న్నారు. కార్యక్రమంలో కురుపాం టిడిపి ఇన్చార్జి తోయక జగదీశ్వరి, నాయకులు పాల్గొన్నారు.

సర్వేను సమర్థవంతంగా నిర్వహించాలి

సీతానగరం: గ్రామాల్లో సర్వేను సమర్థవంతంగా నిర్వహించాలని తహశీల్దార్ ఎంవి రమణ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం రెవెన్యూ, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమావేశ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ కంఠాన్ని భూ వివరాలను, గృహ నిర్మాణాలను సర్వే చేసి వాటిని ఆన్‌లైన్లో పొందుపరచాలన్నారు. సమావేశంలో ఎంపిడిఒ బి.కృష్ణ మహేష్‌రెడ్డి, ఇఒపిఆర్‌డి కె కె దాస్, ఆర్‌ఐ రాజేష్, మండల సర్వేయర్లు, పాల్గొన్నారు.

కంపోస్టు యార్డు పరిశీలన

పాలకొండ : పట్టణంలోని కొత్తవీధి సమీపంలో ఉన్న కంపోస్ట్ యార్డ్‌ను నగర పంచాయతీ కమిషనర్ పివివిడి ప్రసాదరావు శుక్రవారం పరిశీలించారు. తడి, చెత్త నుండి కంపోస్టు ఎరువు తయారు చేయు పద్ధతిని సిబ్బందికి వివరించి విన్డ్ కంపోస్టు ప్రాసెస్ వివరించారు. అనంతరం వీవర్స్ కాలనీ సచివాలయం తనిఖీ చేసి సిబ్బందికి తగు సూచనలు చేశారు.



కంపోస్టుయార్డును పరిశీలిస్తున్న కమిషనర్

కిమ్మిలో ఫ్యామిలీ ఫిజిషియన్

వీరఘట్టం: మండల పరిధిలోని కిమ్మిలో ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమం నిర్వహించారు. వీరఘట్టం పిహెచ్‌సి వైద్యాధికారులు పి. ఉమామహేశ్వరి, వరప్రసాదరావు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గురాన రామ్మోహనరావు, ఎమ్మెల్ హెచ్‌పీలు కావ్య, సూపర్వైజర్ విజయనంద, ఎఎన్‌ఎం రాజేశ్వరి, సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయాలను సందర్శించిన ఎంపిడిఒ

పాలకొండ రూరల్ : మండలంలోని భాసుర, ఎల్‌ఎల్‌పురం సచివాలయాలను ఎంపిడిఒ. డొంక త్రినాథులు శుక్రవారం సందర్శించారు. సిబ్బంది హాజరుతో పాటు రికార్డులు పరిశీలించారు. వాలంటీర్లను సమస్యలు చేసుకొని ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అలాగే బాసుర గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఆర్ బికె భవన పనులను పరిశీలించారు.

బట్టలు, సరుకులు పంపిణీ

పార్వతీపురంరూరల్ : మండలంలోని సంఘంవలస పంచాయతీ సీతంపేటకు చెందిన 50మంది గిరిజనులకు శుక్రవారం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో జిల్లా చైర్మన్ మంచిపల్లి శ్రీరాములు చేతుల మీదుగా బట్టలు, నిత్యవసర సరుకులు అందజేశారు. ఇటీవల జరిగిన అగ్నిప్రమాదం వల్ల సర్వంకోల్పోయిన బంగారు జీవితాలకు వంట పాత్రలు, నిత్యవసర వస్తువులు అందించారు. కార్యక్రమంలో మేనేజింగ్ కమిటీ సభ్యులు కొత్త నాగేశ్వరావు, తాడ్డి రమేష్, బోటు రామకృష్ణ, గెంబలి గణేష్, జిల్లా కోఆర్డినేటర్, శ్రీనివాసరావు, సంగంవలస సర్పంచ్ జడే శ్రీరంజన్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నాడు- నేడు పనులు వేగవంతం

సీతంపేట : నాడు నేడు పనులు వేగవంతం చేయాలని ఎంపిడిఒ కె.గీతాంజలి అన్నారు. నాడు నేడు పనులపై స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో విద్యాశాఖ అధికారులు, వెలుగు సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలంలో 58 స్కూళ్లలో నాడు నేడు పనులు జరుగుతున్నాయని, వీటికి రూ.1027.131 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. మిగతా పనులు వేగవంతం చేయాలన్నారు. సమావేశంలో ఎంఇఒ ఆనందరావు, ఏపిఎం విజయకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

ఫిష్ ఆంధ్రా ద్వారా యువతకు ఉపాధి

భామిని : ఫిష్ ఆంధ్రా -ఫిట్ ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా మండలంలోని బత్తిలిలో ఎఫ్‌డిఒ డి.గోపికృష్ణ ఆధ్వర్యంలో శ్రీనివాసరావు లైవ్ ఫిష్ షాపును ఫిష్ ఆంధ్రా మినీ రిటైల్ షాపుగా మార్చి తాజా చేపలు అమ్మకాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎఫ్‌డిఒ మాట్లాడుతూ ఫిష్ ఆంధ్రా షాపు యూనిట్లు ఏర్పాటుకు సబ్సిడీతో కూడిన ఋణాలు ప్రభుత్వం అందజేస్తుందన్నారు. మండలంలోని బాలేరు, గురండి, బత్తిలిలో ఫిష్ ఆంధ్రా షాపులు ఏర్పాటుచేయడం, మిగిలిన ప్రాంతాల్లో ఈ యూనిట్ల ఏర్పాటుకు భామిని మత్స్య సహాయకులు కె.ఆదినారాయణను సంప్రదించాలని ఎఫ్‌డిఒ తెలిపారు.

17న సంగీత, గాత్ర కచేరీ

పార్వతీపురం రూరల్ : పార్వతీపురానికి చెందిన వాణీ గాన సభ ఆధ్వర్యంలో ఈనెల 17 స్థానిక రాజా హిందీ కళాశాల ఆవరణలో సంగీత గాత్ర కచేరి జరుగనుందని ఆ సంస్థ అధ్యక్షులు మంచిపల్లి శ్రీరాములు శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. హైదరాబాదు సంగీత కళాశాలకు చెందిన వాసా గోపీనాథ్ ఈ అన్నమయ్య సంకీర్తనలు త్యాగరాజ కృతుల ఆలపనలు ఉంటాయని తెలిపారు. సంగీత అభిమానులు హాజరుకావాలని కోరారు.

సేంద్రీయ పద్ధతిని అవలంబించాలి

పాలకొండ రూరల్ : రైతులు సేంద్రియ పద్ధతిని అవలంబించి వ్యవసాయం చేయాలని ఒడిశాలోని పర్లాకిమిడి సెంచూరియన్ యూనివర్సిటీ అగ్రికల్చర్ బీఎస్సీ విద్యార్థులు అన్నారు, రుక్ష అన్నారు. మండలంలోని పరుశురాంపురంలో రైతులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీవామృతం పంటకు ఎంతో బలమని అన్నారు. సేంద్రియ పద్ధతి అవలంబించి సాగు చేయాలని రైతులను కోరారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ తాడేళ్ల మన్మధనాయుడు అన్నారు. శుక్రవారం పరజపాడు పంచాయతీ రైతు భరోసా కేంద్రంలో మండల స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు వ్యవసాయ అధికారులు సిద్ధం కావాలని కోరారు. ఎంపిపి బొంగు సురేష్ మాట్లాడుతూ వ్యవసాయ అధికారులు, సిబ్బంది రైతులకు అందుబాటులో ఉంటూ తగు సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరారు. సమావేశంలో ఎంపిటిసి సభ్యులు అన్నపూర్ణమ్మ, సర్పంచ్ రామకృష్ణ, ఎఒ హర్షలత, సభ్యులు అప్పలనాయుడు, రైతులు పాల్గొన్నారు.

భామిని : స్థానిక ఆర్‌బికెలో వ్యవసాయధికారి కె.సింహాచలం ఆధ్వర్యంలో మండల స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి ప్రతినిధి తోట సింహాచలం మాట్లాడుతూ ధాన్యం కొనుగోలుకు చర్యలు తీసుకోవాలని, రైతులు నేరుగా ఆర్‌బికెల ద్వారా ధాన్యం అమ్మకాలు చేపట్టాలని తెలిపారు. సమావేశంలో వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వలురౌతు రవణమ్మ, తహశీల్దార్ అప్పారావు, వైస్ ఎంపిపి బి.ధర్మారావు, జెడ్‌పిటిసి ప్రతినిధి బొడ్డేపలి ప్రసాదరావు, ఎఇఒలు పాల్గొన్నారు.

సీతానగరం : రైతుల కళ్లాల వద్ద నుంచే ధాన్యం సేకరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను జిల్లా



వీరఘట్టం : సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి

వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వాకడ నాగేశ్వరరావు ఆదేశించారు. స్థానిక మండల వ్యవసాయ కార్యాలయంలో వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పోల ఈశ్వర నారాయణ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశం నాగేశ్వరరావు మాట్లాడుతూ ఇ-పంట నమోదు ప్రకారం ఆర్‌బికెల్లో ఒక టెక్నికల్ అసిస్టెంట్, నలుగురు వాలంటీర్లను నియమించి ధాన్యం సేకరించనున్నట్టు తెలిపారు. వివిఎ సూపర్వైజర్ ఆఫీసర్‌గా వ్యవహరిస్తారని తెలిపారు. ఎఒ ఎస్.అవినాష్ మాట్లాడుతూ రబీకి అవసరమైన అపరాలు, వేరుశనగ, కట్టె జనుము విత్తనాలు రైతు భరోసా కేంద్రం వద్ద సబ్సిడీపై అందజేస్తున్నామని, కావల్సిన రైతులు వివిఎను సంప్రదించాలని కోరారు. సమావేశంలో జెడ్‌పిటిసీ మామిడి బాబ్జీ, ఎంపిపి ప్రతినిధి బలగ శ్రీరాములు, ఉద్యానవన శాఖ అధికారి, మండల పశు వైద్య అధికారి, సివిల్ సప్లైస్ టెక్నికల్ అసిస్టెంట్, ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు పాల్గొన్నారు.

పాచిపెంట: స్థానిక వ్యవసాయ కార్యాలయంలో వ్యవసాయ సలహా మండలి సమావేశం జరిగింది. ఈసమావేశంలో సాలూరు సహాయ వ్యవసాయ సంచాలకులు మధుసూదనరావు మాట్లాడుతూ గతేడాది ధాన్యం కొనుగోలులో వచ్చిన సమస్యలను దృష్టిలో ఉంచుకొని చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ ధాన్యం కొనుగోలుకు సంబంధిత కమిషన్ రాలేదని, అలాగే రైస్ మిల్లులు ట్యాగ్ చేసినప్పుడు వాటి ఫోన్ నెంబర్లు కూడా వెబ్సైట్లో కనబడేలా సూచించారు. ఎఒ కె.తిరుపతిరావు మాట్లాడుతూ పిఎం కిసాన్ ఇకెవైసి పూర్తి చేయని రైతులు పూర్తి చేసుకునేలా చేయాలని కోరారు. సమావేశంలో ఎఇఒ హైమా, సభ్యులు, రైతులు, పాల్గొన్నారు.

వీరఘట్టం: ధాన్యం కొనుగోలుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎంపిపి డి.వెంకటరమణ నాయుడు అధికారులను ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం జరిగింది. మండలంలో ఒక రైస్ మిల్ లేదని, వేరే మండలానికి ధాన్యం తరలించాలా వీటిపై ఉన్నతాధికారులకు రైతులు వేరే జిల్లాలో ధాన్యం విక్రయాలు జరుపుకునేలా అధికారులు, సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించారు. సమావేశంలో మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కెవెల్ ప్రసాదరావునాయుడు, ఎఒ కె.మన్మథరావు, సలహా మండలి సభ్యులు ఎస్.సింహాచలం, వి.శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

బలిజిపేట : విత్తనాల సబ్సిడీని వినియోగించుకోవాలని



అపరాల విత్తనాలను అందజేస్తున్న వాకాడ నాగేశ్వరరావు

మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ గంగయ్య కోరారు. స్థానిక ఆర్‌బికెలో మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం జరిగింది. పెసర, మినుము విత్తనాలు 33శాతం రాయితీపై అందుబాటులో ఉంచామన్నారు. ధాన్యం కొనుగోలు గురించి చర్చించారు. సమావేశంలో అధికారులు, వివిఎలు, సభ్యులు పాల్గొన్నారు.

పార్వతీపురం రూరల్ : త్వరలో ధాన్యం కొనుగోలు చేపట్టనున్న దృష్ట్యా రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని ఎడిఎ వెంకటేష్ అన్నారు. స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో నిర్వహించిన వ్యవసాయ మండల వ్యవసాయ సలహా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో ఎఒ ఆర్.రేఖ, అభ్యుదయ రైతులు మజ్జి చంద్రశేఖరరావు, మువ్వల సత్యంనాయుడు, ఆర్‌బికె సిబ్బంది పాల్గొన్నారు.

పాలకొండ : స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో మండలస్థాయి వ్యవసాయ సలహామండలి సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎడిఎ రత్నకుమారి మాట్లాడుతూ ఆర్‌బికె కేంద్రాల ద్వారా మరింత మెరుగైన సేవలు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సలహామండలి చైర్మన్ రణస్థలం రాంబాబు, వైస్ ఎంపిపిలు కె.సూర్యప్రకాష్, వాకముడి అనీల్‌కుమార్, ఎఒ వై.వాహిణి తదితరులున్నారు.

గృహ నిర్మాణంలో పురోగతి రావాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్

పట్టణం గృహ నిర్మాణాల్లో మరింత పురోగతి రావాలని కలెక్టర్ నిశాంత్‌కుమార్ అన్నారు. పార్వతీపురం, ఇతర ప్రాంతాల్లో గృహ నిర్మాణాలపై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ శుక్ర వారం చర్చించారు. మంజూరైన ఇళ్లను లబ్ధిదారులు త్వరగా నిర్మాణం చేసేందుకు ప్రేరణ కల్పించాలని అధికారులను ఆదేశించారు. లబ్దిదారులకు అవసరమైన సామగ్రి సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. సామగ్రి సరఫరా చేసిన 15 రోజుల్లో నిర్మించాలని కోరారు. నిర్మాణాలు పూర్తి చేసేందుకు సహాయ సహకారాలు అందించినప్పటికీ నిర్మాణాలు చేపట్టకపోతే నిబంధనల మేరకు రద్దు చేసే అవకాశాన్ని పరిశీలించాలని సూచించారు. అర్హత, ఆసక్తి గల లబ్దిదారులకు కేటాయింపు చేయడం వల్ల త్వరగా నిర్మాణాలు చేసే అవకాశం ఉంటుందని అన్నారు. డిసెంబరు 21 నాటికి గృహాల నిర్మాణం పూర్తి చేయాలని ప్రభుత్వం ప్రాదాన్యత ఇస్తుందని ఆయన పేర్కొన్నారు. నిర్మాణాల్లో పురోగతి రావాలని, బాగా జాప్యం చేసే వారికి నోటీసులు జారీకి చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో దాదాపు 95 శాతం మ్యాపింగ్ అయిందన్నారు. గతంలో పట్టాలు ఇవ్వడం జరిగిందని, అయితే స్థలం చూపించలేదని, స్థలం చూపించాలని కోరుతున్నారని, దానిపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. సమావేశంలో మున్సిపల్ చైర్ పర్సన్ బోను గౌరీశ్వరి, డిఆర్ఒ జె.వెంకటరావు, ఆర్‌డిఒ కె.హేమలత, మున్సిపల్ కమిషనర్ జె.రామఅప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీల్లో సోషల్ ఆడిట్

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

జగనన్న కాలనీలో జరుగుతున్న మోసాలు, అవకతవకలపై సోషల్ ఆడిట్ నిర్వహించి ప్రజలకు వాస్తవాలు తెలియజేస్తామని జనసేన నాయకులు అన్నారు. శుక్రవారం స్థానిక జనసేన కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా నాయకులు విలేకరులతో మాట్లాడారు. జగనన్న ఇళ్లు పేదలందరికీ కన్నీళ్లు అనే నినాదంతో సోషల్ ఆడిట్ తనిఖీలు నిర్వహించి, ఆయా కాలనీలో జరిగిన, జరుగుతున్న మోసాలు, అవకతవకలు, సమస్యలు, మౌలిక వసతుల లేమి తదితరులు వాటిపై ఆరా తీసి ప్రజలకు వాస్తవాలు చెబుతామని తెలిపారు. అలాగే జగనన్న కాలనీలకు సేకరించిన భూములకు ఎంత ధర చెల్లించారు. ఆ భూములు చదును చేసేందుకు ఎంత ఖర్చు చేశారు తదితర అంశాలను సేకరించి ప్రజలకు తెలియజేస్తామన్నారు. సమావేశంలో అనిల్‌కుమార్, దాలి నాయుడు, బంటు శిరీస్, రాజాన రాంబాబు, మండల శరత్ కుమార్, మానేపల్లి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా మహాసభను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి -పాలకొండ రూరల్

ఈనెల 13న సీతానగరం మండల కేంద్రంలో జరగనున్న మధ్యాహ్నం భోజనం పథకం కార్మిక సంఘం 3వ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం పాలకొండ మండల కార్యదర్శి ఎ.పద్మావతి పిలుపునిచ్చారు. ఈమేరకు శుక్రవారం పాలకొండలో కరపత్రాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మధ్యాహ్నం భోజనం పథకంలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలపై భవిష్యత్తు పోరాట కార్యక్రమాలపై చర్చించడానికి ఈ మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన పథకం పాలకొండ మండల అధ్యక్షులు ఎం.సూర్యకాంతం, ఉపాధ్యక్షులు ఎస్.బేగం కుమారి, సిఐటియు పాలకొండ మండల సమన్వయ కమిటీ కార్యదర్శి కె.రాము పాల్గొన్నారు.

పాచిపెంట : మధ్యాహ్న భోజన కార్మికుల 3వ జిల్లా మహాసభ సీతానగరంలో ఈనెల 13న జరుగుతుందని, ఈ మహాసభకు జిల్లాలోని మధ్యాహ్న భోజన కార్మికులంతా కదిలి జయప్రదం చేయాలని మధ్యాహ్న భోజన కార్మిక సంఘం మండల నాయకులు ఆకుల సింహాచలమమ్మ, పి జానకమ్మ పిలుపునిచ్చారు. మండలంలోని కేసలి ప్రాథమిక పాఠశాల వద్ద కరపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ మహాసభల్లో సమస్యలు చర్చించి రానున్న కాలంలో ఎటువంటి ఉద్యమాలు చేయాలని నిర్ణయం చేయడం జరుగుతుందన్నారు. కావున మధ్యాహ్న భోజన కార్మికులంతా పెద్దఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు.

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి - సీతంపేట

ఈనెల 14 నుంచి 20 వరకు 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు స్థానిక గ్రంథాలయంలో నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ అధికారి బి.గణేష్‌బాబు ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు వ్యాసరచన, క్విజ్ తదితర పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలి

కలెక్టరేట్ : అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి గంట జ్యోతి అన్నారు. శుక్రవారం పార్వతీపురం అంగనావాడీ ప్రాజెక్టు మహాసభ స్థానిక సుందరయ్య భవనంలో సిహెచ్ గౌరమ్మ అధ్యక్షతన జరిగింది. ఈ మహాసభలో జ్యోతి మాట్లాడుతూ అంగన్‌వాడీ సెంటర్లకు మౌలిక సదుపాయాలు, నాణ్యమైన ఆహారాన్ని సరఫరా చేయాలని, నూనె, కందిపప్పు క్వాలిటీ పెంచాలని, గ్యాస్‌ను ప్రభుత్వమే సరఫరా చేయాలని, నూతన విద్యా విధానం రద్దుచేసి సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యుటీ అమలు చేయాలని, సంక్షేమ పథకాల అమలు చేసి, ఇళ్ల స్థలాలు, అంగన్వాడీలకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, రాజకీయ వేధింపులు, తొలగింపులు ఆపాలని, తొలగించిన అంగన్వాడీలను వెంటనే విధుల్లో చేర్చుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ప్రాజెక్టు నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా సిహెచ్ గౌరమ్మ, కార్యదర్శిగా వి.ధర్మవతి, సభ్యులుగా విజయ, రాజేశ్వరి, అలివేలు, సత్యవతి, అరుణ, పద్మ, జ్యోతి ఎన్నికయ్యారు. కార్యక్రమంలో శ్రామిక మహిళ నాయకులు వి.ఇందిర, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మధరావు పాల్గొన్నారు.

ఏనుగులను తరలించాలి

కొమరాడ : ఏనుగుల గుంపును అటవీ ప్రాంతానికి లేదా జూకు తరలించాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం కొమరాడలో నిరసన చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఏనుగుల సంచారంతో ప్రజల ఆందోళన చెందుతున్నారన్నారు. ఏనుగుల బారినపడి ఇప్పటి వరకూ ఏడుగురు చనిపోగా రూ.3 కోట్ల వరకు పంట నష్టం జరిగిందన్నారు. నేటికీ కొంత మందికి నష్టపరిహారం చెల్లించని పరిస్థితి ఉందన్నారు. జిల్లా ప్రజాప్రతినిధులు డిప్యూటీ సిఎం పదవుల్లో ఉన్నా కనీసం ఏనుగుల గురించి నేటికీ ఒక్క మాట మాట్లాడకపోవడంతో ప్రజలపై వారికి ఎంత ప్రేమ ఉందో అర్ధవుతుందన్నారు. తక్షణమే కలెక్టర్ అయినా స్పందించి ఏనుగుల సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. నిరసనలో వివిధ సంఘాల నాయకులు రెడ్డి శివున్నాయుడు, శివున్నాయుడు, అక్కులునాయుడు, పోలినాయుడు, లక్ష్మణావు, వెంకటినాయుడు, రామినాయుడు పాల్గొన్నారు.

అసమర్థ సిఎం జగన్ : టిడిపి

ప్రజాశక్తి - సాలూరు రూరల్

ఒక అసమర్థ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డని, రాష్ట్రంలో ఇది వరకు ఎప్పుడూ ఇటువంటి అసమర్థ సిఎం లేరని టిడిపి నియోజకవర్గ ఇంఛార్జి గుమ్మిడ సంధ్యారాణి అన్నారు. మండలంలోని మామిడిపల్లిలో శుక్రవారం నిర్వహించిన బాదుడే బాదుడు కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ ఇటువంటి అసమర్ధపాలన చూడలేదని, నిత్యం కక్షలు, కావేశాలు, ప్రతిపక్షాలను అణచివేతకే సమయమంతా వెచ్చిస్తున్నారని విమర్శించారు. ప్రతిపక్ష నాయకుడిగా ఎన్నికల సమయంలో సాలూరు బహిరంగ సభలో గిరిజన యూనివర్సిటీ సాలూరు పరిసర ప్రాంతాల్లో నెలకొల్పుతా మని ప్రకటించి మూడేళ్లయినా ఇప్పటికీ ఎక్కడ ప్రారంభిస్తారు, ఎప్పుడు ప్రారంభిస్తారో తెలియదంటూ ప్లకార్డులతో గ్రామంలో తిరిగారు. అనంతరం మూడు రోడ్ల కూడలిలో స్థానిక నాయకులు ఏర్పాటు చేసిన అన్నా కేంటీన్‌ను ప్రారంభించి పేదలకు భోజనం అందించారు. కార్యక్రమంలో సాలూరు, మక్కువ మండలాల టిడిపి అధ్యక్షులు అముదాల పరమేష్, గుళ్ళ వేణు గోపాల్, నాయకులు బూసా తవుడు, డొంక అన్నపూర్ణ, తాడుతూరి తిరుపతిరావు, బి.తిరుపతిరావు, వెంకట రమణ, బుజ్జి, రామారావు, ఆటో యూనియన్ నాయకులు జ్యోతిష్యరావు పాల్గొన్నారు.

బలిజిపేట : స్థానిక బస్టాండ్ వద్ద శుక్రవారం టిడిపి బొబ్బిలి నియోజకర్గ ఇన్చార్జి ఆర్‌విఎస్‌ఆర్ కె రంగారావు (బేబినాయన) ఆధ్వర్యంలో అన్నా క్యాంటీన్‌ను పారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి శుక్రవారం జరిగే సంతకు వస్తున్న



భోజనం వడ్డిస్తున్న బేబినాయన

మండల ప్రజలకు అన్న క్యాంటీన్ ద్వారా భోజన సదుపాయం ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. సుమారు 500 మందికి పైగా భోజనాలను వినియోగించుకున్నారు. ప్రతి శుక్రవారం అందేలా అన్నా క్యాంటీన్ నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవి, మండల పార్టీ నాయకులు పెంకి వేణు గోపాలనాయుడు, వాడాడ రాము, మజ్జి అప్పారావు, తదితరులు పాల్గొన్నారు



పోటీలను ప్రారంభిస్తున్న డిఇఒ రమణ

ఆటలను అలవాటుగా చేసుకోవాలి : డిఇఒ

ప్రజాశక్తి - సీతానగరం

విద్యార్థులు చిన్నప్పటి నుంచే ఆటలను అలవాటు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్‌డివి రమణ అన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి ఆటల పోటీలను ఆయన ప్రారంభించారు. త్రోబాల్, బ్యాడ్మింటన్, టెన్నీకాయిట్ ఆటల పోటీలు నిర్వహించారు. అనంతరం డిఇఒ మాట్లాడుతూ పిల్లలకు క్రీడల పట్ల ఆసక్తి పెంచాలని వ్యాయామ ఉపాధ్యాయులకు సూచన చేశారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు ఎ.జగన్నాధరావు, స్థానిక వ్యాయామ ఉపాధ్యాయులు ఎం.శ్రీనివాసరావు, గాంధీ, కె.తిరుపతిరావు, వాసు, వెంకటనాయుడు, వి.తవిటినాయుడు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

నాడు -నేడు పనులు పరిశీలన

మండలంలోని నిడగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న నాడు-నేడు పనులను డిఇఒ ఎస్‌డివి రమణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరితగతిన పనులు పూర్తి చేయాలన్నారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి విద్యార్థులను భోజనం బాగుందా లేదా అని అడిగి తెలుసుకున్నారు. భోజనం బాగుందని చెప్పడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే పాఠశాల రికార్డులను, ఉపాధ్యాయుల హాజరు పట్టిని పరిశీలించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.శివంనాయుడు, ఉపాధ్యాయులు రవికుమార్, అప్పారావు పాల్గొన్నారు.

15న క్రీడా పోటీలు

ప్రజాశక్తి - సీతంపేట

ఐటిడిఎ పరిధిలో గల ఆశ్రమ, ఏకలవ్య పాఠశాలల్లోని గిరిజన విద్యార్థులకు ఈనెల 15న ఐటిడిఎ స్థాయిలో క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు పిఒ బి.నవ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తొలుత 12న ఎటిడబ్ల్యుఒల క్లస్టర్ స్థాయిలో పోటీలు జరుగుతాయని, క్లస్టర్ స్థాయిలో గెలుపొందిన వారికి ఈనెల 15న ఐటిడిఎ స్థాయిలో క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, ఆర్చరీ, షటిల్ బాడ్మింటన్, 100, 200, 800, 1500 మీటర్ల పరుగుపందెం, లాంగ్ జంప్, హై జంప్, షార్ట్ పుట్, డిస్కస్ త్రో విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పూర్ణపాడు - వంతెన పనులు పూర్తి చేయాలి

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

నాగావళి నదిపై కొమరాడ మండలంలోని నిర్మిస్తున్న పూర్ణపాడు-లాబేసు వంతెన పనులు వెంటనే పూర్తి చేయాలని ఇంజనీరింగ్ శాఖ అధికారులను, కాంట్రాక్టర్లను ఎమ్మెల్యే పి.పుష్ప-శ్రీవాణి ఆదేశించారు. శుక్రవారం చినమేరంగిలోని తన నివాస గృహంలో ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్‌తో సమావేశం నిర్వహించారు. వంతెన పనులను వెంటనే ప్రారంభించి అందుబాటులోకి తేవాలని పంచాయతీరాజ్‌శాఖ ఇఇ కృష్ణాజీ, కాంట్రాక్టర్ రాకేష్ రెడ్డిను ఎమ్మెల్యే ఆదేశించారు. గిరిజన ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని పనులను వేగంగా పూర్తి చేయాలని అన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ నదిలో నీటిమట్టం తగ్గిందని త్వరలోనే పనులను ప్రారంభించి బ్రిడ్జి పనులు పూర్తి చేస్తామని తెలిపారు.

వైద్యాధికారిగా ఉషారాణి

ప్రజావక్తి - సీతానగరం

స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి పి.ఉషారాణి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందిస్తానన్నారు. ఇక్కడ పనిచేసిన వైద్య అధికారి బి.నీలిమ ప్రసుజా పైచదువుల నిమిత్తం వెళ్లారు. ఆమె స్థానంలో ఈమె ఇక్కడకు నియమితులయ్యారు

పనుకువలసలో గడపగడపకు..

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలోని పనుకువలసలో ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆధ్వర్యాన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శుక్ర వారం జరిగింది. ఎమ్మెల్యే గడప గడపకు వెళ్లి ప్రజలను కలుసుకుని వారికి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు వివరించి, సమస్యలు ఏమైనా ఉంటే అడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు, నాయకులు, కార్యకర్తలు, సచివాలయం ఉద్యోగులు, వాలంటీర్లు, స్థానిక ప్రజలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటిలో మరో సీటు

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

మండలంలోని బిజెపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన సబ్బాన కిషోర్ ట్రిపుల్ ఐటిలో సీట్ సంపాదించాడు. ఈ ఏడాది ఈ పాఠశాల నుంచి ఇటీవల ముగ్గురు విద్యార్థులు ఎంపిక కాగా, మళ్లీ కిషోర్ ఎంపిక కావడం పట్ల పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది విద్యార్థిని అభినందించారు.

ఉపాధి కోసం పోస్టుకార్డు ఉద్యమం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

2010 - 18 వరకు వయోజన విద్య సాక్షర భారత్ కార్యక్రమంలో గ్రామ సమన్వయకర్తలుగా పనిచేసి నేడు నిరుద్యోగులు ఉపాధి కల్పించాలని కోరుతూ పోస్ట్ కార్డు ఉద్యమాన్ని చేపడుతున్నట్లు ఇరిడి ఎంపిటిసి కె.మల్లేశ్వరరావు తెలిపారు. 2010-18 వరకు వయోజన విద్య సాక్షరభారత్ కార్యక్రమంలో గ్రామ సమన్వయ కర్తలుగా పనిచేస్తూ ప్రభుత్వాలు అమలు చేసిన వయోజన విద్య, ఎన్నికల సిబ్బందిగా, పెన్షన్లు పంపిణీ, ఓటరు నమోదు, జనాభా లెక్కలు మరుగు దొడ్ల నిర్మాణం వంటి కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొని నెలకు రూ.2వేలకే సేవలందించారన్నారు. అయితే 2018న అర్ధాంతరంగా 9 నెలలు వేతనాలు బకాయి ఉంచుతూనే విధుల నుంచి తొలగించారని ఆందోళన వ్యక్తం చేశారు. అయితే 2019న ఎన్నికల ప్రచారంలో ముఖ్యమంత్రి చేపట్టిన పాదయాత్రలో తమ గోడును విన్నవించగా, న్యాయం చేస్తానని హామీ ఇచ్చి మూడేళ్లయినా ఊసేలేదన్నారు. దీంతో సుమారు 21వేల కుటుంబాల ఆకలి కేకలు విని మమ్మల్ని విధుల్లోకి తీసుకోవాలని, వయోపరిమితి వల్ల ఏ ఉద్యోగానికీ అర్హులు కాలేమని వాపోయారు.

నేరాలు ఘోరాలు

ఆటోనగర్‌లో వ్యక్తి మృతి

సాలూరు: పట్టణంలోని ఆటోనగర్ లో బోని ఆదినారాయణ (50) అనే వ్యక్తి మృతి చెందినట్లు టౌన్ ఎస్ఐ పాపారావు చెప్పారు. పాచిపెంటకు చెందిన ఆదినారాయణ పట్టణంలోని రండి అచ్యుతరావు మేకలు కాస్తుంటారు. ఆటోనగర్‌లో మద్యం సేవించి తాగునీరందక చనిపోయి ఉంటాడని భావిస్తున్నామని తెలిపారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

ఆటో ఢీకొని దంపతులకు గాయాలు

పార్వతీపురంరూరల్ : స్కూటీపై వీరఘట్టం మండలం కిమ్మి నుంచి పార్వతీపురం వైపు వస్తున్న వాన వెంకటరమణ, ఉషారాణిలను బలిజిపేట మండలం పెద్దింపేట వద్ద ఎదురుగా వస్తున్న ఆటో శుక్రవారం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో దంపతులిద్దరూ గాయాలపాలయ్యారు. స్పందించిన స్థానికులు 108 వాహనంలో జిల్లా ఆసుపత్రికి తరలించగా వైద్యులు చికిత్స అందిస్తున్నారు. అవుట్ పోస్ట్ పోలీసులు వివరాలు నమోదు చేశారు.

నాటు సారా రవాణాపై దాడులు

పార్వతీపురంటౌన్ : ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ ఎల్.ఉపేంద్ర ఆధ్వర్యంలో వాహన తనిఖీలు చేస్తుండగా పార్వతీపురం నుంచి అలమండ రోడ్డులో రావికోన వద్ద 360 లీటర్ల నాటు సారాను సీజ్ చేసి, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు సిఐ తెలిపారు. ఇందులో భాగంగా బాలగుడబకు చెందిన వండాన శరత్, బంగారి కృష్ణ, సిరిపురపు అభి, కొప్పర సంతోష్‌ను అరెస్ట్ చేసి, ఈ కేసుకు సంబంధించిన మరో ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఈ నలుగుర్ని రిమాండ్‌కు తరలించామన్నారు. దాడుల్లో ఎస్సైలు శేఖరం, రమణ, సిబ్బంది పాల్గొన్నారు.